

కొనుగోళ్లు సరే.. నిల్వ ఎలా?



- జిల్లాలో కత్తి మీద సాములా ధాన్యం నిలువ వ్యవహారం
- ఎఫ్‌సీఐ పాయింట్ లేక తిప్పలు
- తలకు మించిన భారంగా డిచ్‌పల్లి పాయింట్‌కు తరలింపు
- అన్ లోడింగ్ కోసం రోజుల తరబడి ఎదురుచూపులు
- రైస్ మిల్లుల్లోనే లక్ష ఎంటీఎస్‌లకు పైగా ధాన్యం
- ఆదిలాబాద్‌లో పునరుద్ధరించాలంటున్న ఆఫీసర్లు
- స్థానికంగానే ఎఫ్‌సీఐ సేకరిస్తే ప్రయోజనం
- ప్రతీఏటా ఇదే సమస్య

నిర్మల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మొన్నటిరబీలో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించే వ్యవహారం సివిల్ సప్లయిస్ అధికారులకు కత్తిమీద సాములా మారుతుంది. నిర్మల్‌లో ఎఫ్‌సీఐకి సంబంధించిన అన్‌లోడ్ పాయింట్ లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ప్రస్తుతం జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని అంతా డిచ్‌పల్లి ఎఫ్‌సీఐ పాయింట్‌కు తరలించాల్సి ఉంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని 69 రైస్‌మిల్లులలో నిలువ చేశారు. ఈ ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉండడంతో అధికారులంతా ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. నిర్మల్‌లో ఎఫ్‌సీఐ పాయింట్ లేకపోవడంతో అధికారులు ఈ ధాన్యాన్ని లారీలలో డిచ్‌పల్లి ఎఫ్‌సీఐ పాయింట్‌కు తరలిస్తున్నారు. అయితే డిచ్‌పల్లిలోని ఎఫ్‌సీఐ పాయింట్‌కు నిజామాబాద్ జిల్లాకు చెందిన ధాన్యాన్ని కూడా పెద్దమొత్తంలో తరలిస్తుండడంతో పలురకాల సమస్యలు ఏర్పడుతున్నాయి. నిర్మల్ నుంచి తరలించిన ధాన్యాన్ని డిచ్‌పల్లి ఎఫ్‌సీఐ అధికారులు ఆలస్యంగా అన్‌లోడ్ చేసుకుంటున్న కారణంగా రోజుల తరబడి ఈ లారీలు అక్కడే పడిగాపులు కాస్తున్నాయి. వారం రోజులకు తక్కువ కాకుండా అన్‌లోడింగ్‌కు సమయం పడుతుందని దీని కారణంగా ఒక్కోలారీల కిరాయి 30 వేల రూపాయల వరకు చెల్లించాల్సి వస్తుందంటూ సివిల్ సప్లయిస్ ఆఫీసర్స్ పేర్కొంటున్నారు. డిచ్‌పల్లి ఎఫ్‌సీఐ ఆఫీసర్లు కూడా స్థానికంగానే నిజామాబాద్ జిల్లాకు చెందిన ధాన్యం లోడ్‌లను వెంటనే అన్‌లోడ్ చేసుకుంటున్నారని నిర్మల్‌కు చెందిన ధాన్యాన్ని మాత్రం అన్‌లోడ్ చేసుకుందు ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని అన్ని రైస్‌మిల్లుల్లో ప్రస్తుతం ధాన్యం నిలువలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. దీనికి తోడుగా కొద్దిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలు కూడా సమస్యగా మారుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని ధాన్యాన్ని అంతా ఎఫ్‌సీఐకి అప్పజెప్పాల్సి ఉన్నప్పటికీ రవాణా, ఎఫ్‌సీఐ పాయింట్ లేకపోవడం, అన్‌లోడింగ్ ఆలస్యం అవుతుండడం లాంటి అంశాలు జాప్యానికి కారణం అవుతున్నాయని అంటున్నారు.

ఆదిలాబాద్‌లో పునరుద్ధరించాలంటున్న ఆఫీసర్లు

కాగా గతంలో ఆదిలాబాద్ వద్ద ఉన్న ఎఫ్‌సీఐ పాయింట్‌ను పునరుద్ధరించాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. ప్రతిఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లలో ధాన్యం దిగుబడులు ఇబ్బడి ముబ్బడిగా వస్తుండడం అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పజెప్పే ప్రక్రియ సంబంధిత యంత్రాంగానికి సవాలుగా మారుతుంది. ఈ క్రమంలో సివిల్ సప్లయిస్ సేకరించిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పజెప్పాల్సి ఉంటుంది. జిల్లాలో ఎఫ్‌సీ ఐ పాయింట్ లేకపోవడంతో ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లోని పాయింట్లకు ధాన్యాన్ని తరలించాల్సి వస్తోంది. గతంలో ఆదిలాబాద్‌లో ఉన్న ఎఫ్‌సీఐ పాయింట్‌ను 2014లో ఎత్తేశారు. ఇక్కడ రైల్వేట్రాక్‌తో పాటు గూడ్స్ షెడ్ అందుబాటులో ఉన్న కారణంగా నిర్మల్ జిల్లాలోని ధాన్యాన్ని అక్కడికి తరలించేవారు. అయితే ఇక్కడి పాయింట్‌ను అకారణంగా ఎఫ్‌సీఐ ఎత్తివేయడంతో ఇతర జిల్లాల పాయింట్లపై ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. ధాన్యం దిగుబడులు, కొనుగోలు పెద్ద ఎత్తున సాగుతున్నందున ఆదిలాబాద్‌లో తిరిగి ఎఫ్‌సీఐ పాయింట్‌ను తిరిగి పునరుద్ధరించాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది.

స్థానికంగానే ఎఫ్‌సీఐ సేకరిస్తే ప్రయోజనం

కాగా సివిల్ సప్లయిస్ నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐ స్థానికంగానే సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం ధాన్యం విలువ కన్నా రవాణా చార్జీలే ఎక్కువ అవుతున్నాయన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఒకేసారి ఎఫ్‌సీఐ పాయింట్‌కు పలు జిల్లాల నుంచి పెద్దమొత్తంలో ధాన్యం లారీలలో తరలిస్తున్నందున అన్‌లోడింగ్ సమస్యగా మారుతుందని అంటున్నారు. అక్కడ లారీలు రోజుల తరబడి అన్‌లోడింగ్ పాయింట్ వద్ద పడిగాపులు కాస్తున్నాయి. దీని కారణంగా రవాణా చార్జీల భారమే కాకుండా వెయిటింగ్ చార్జీలు కూడా అదనపు భారమవుతున్నాయి. జిల్లాకేంద్రంలో మార్కెటింగ్ గిడ్డంగుల శాఖకు సంబంధించిన గోదాములు అందుబాటులో ఉండటమే కాకుండా రోడ్డు రవాణా సౌకర్యం కూడా అందుబాటులో ఉండడంతో ఎఫ్‌సీఐ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని పలువురు సూచిస్తున్నారు. నిర్మల్‌లో ఎఫ్‌సీఐ పాయింట్ ఏర్పాటైతే సివిల్ సప్లయిస్ శాఖకు ఆర్థిక భారం తగ్గడమే కాకుండా ఇక్కడి రైస్ మిల్లులో ధాన్యం నిలువ సమస్య కూడా పరిష్కారం అవుతుందని అంటున్నారు.

ప్రతి ఏటా ఇదే సమస్య..

ప్రతియేటా ఖరీఫ్, రబీ సీజన్‌లలో ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని నిల్వ చేసే వ్యవహారం ప్రధాన సమస్యగా మారింది. అధికారులు కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రక్రియను వేగవంతం చేస్తున్నప్పటికి ఈ కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసే వ్యవహారం సవాలుగా మారుతోంది. సీయంఆర్ కింద రైస్‌మిల్లులకు కేటాయించిన కోటా మేరకు ధాన్యాన్ని చేరవేస్తున్నప్పటికి మిగతా ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలన్న అంశమే యంత్రాంగానికి తలనొప్పులు సృష్టిస్తోంది. కాగా రైస్‌మిల్లుల్లో గత రబీ, ఖరీఫ్ సీజన్‌లకు సంబందించిన ధాన్యం మిల్లింగ్ కాక కుప్పలు తెప్పలుగా పడి ఉంటున్న కారణంగా కొత్తగా వచ్చే ధాన్యాన్ని నిల్వ చేసే అంశం మిల్లర్లకు సైతం ప్రాణ సంకటంగా మారుతోంది. ప్రతీసారి అధికారులకు ధాన్యాన్ని తరలించడం, తరలించిన ధాన్యాన్ని నిల్వ చేయడం అనే అంశం వెంటాడుతోంది. ఇప్పటికైనా ధాన్యం నిల్వ విషయంలో ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ రూపొందించాలని కోరుతున్నారు.



అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- త్యాగాల చరిత్ర గాంధీ కుటుంబానిది
- రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేయాలి
- మతోన్మాద బీజేపీని గద్దె దించాలి
- బూత్ లెవల్ ఏజెంట్లు, కో ఆర్డినేటర్‌లతో సమావేశంలో
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 8 : దేశంకోసం జీవితాలను త్యాగం చేసిన ఘనత గాంధీ కుటుంబానిదని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం స్థానిక రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో పార్టీ బూత్‌స్థాయి ఏజెంట్లు, నాయకులు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బీజేపీ పార్టీ మతాల మధ్య చిచ్చు పెడుతుందని, మతోన్మాద బీజేపీని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందని నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులకు ఆమె పిలుపునిచ్చారు. గడిచిన పది సంవత్సరాల్లో బీజేపీ హయాంలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని అన్నారు. చివరకు మనుషులు వేసుకునే దుస్తులపై కూడా 12శాతం జీఎస్టీ పన్ను విధించారని అదే విధంగా దేవుడిని భక్తులు ప్రేమగా పూజించే ఆగర్‌బత్తులపై కూడా 5శాతం జీఎస్టీ పన్ను విధించిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీకి లాభం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ పని చేస్తుందన్నారు. చాయ్ వాలా అని చెప్పుకునే మోడీ రైల్వేరంగంతో పాటు మిగతా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటు పరం చేశారన్నారు. చివరకు అగ్నిపథ్ పథకాన్ని కూడా ప్రైవేటు పరం చేశారని ప్రభుత్వంపై ఆమె ధ్వజమెత్తారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ ఆదానీ, అంబానీలకు పెద్దపీట వేసిందే తప్ప పేద ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు బ్యాంకుల ద్వారా 6శాతం వడ్డీకి రుణాలు ఇస్తే పేద, మధ్య తరగతి రైతులకు 24శాతం వడ్డీపై రుణాలను ఇస్తుందన్నారు. భారతీయ జనతాపార్టీని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలంటే కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ త్వరగా పరిష్కారమవుతాయని అన్నారు. గడిచిన పది సంవత్సరాల కాలంలో కేంద్రప్రభుత్వం ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు, ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్యాంనాయక్, సత్తు మల్లేష్, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సాధ సుదర్శన్, దశరథ రాజేశ్వర్, ఎంబడి రాజేశ్వర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

కుభీర్ మండల కేంద్రంలో

నేడు కుస్తీ పోటీలు

- ఉగాది పండుగ సందర్భంగా నిర్వహణ

కుభీర్, ఏప్రిల్ 8 : మండల కేంద్రం కుభీర్‌లో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించనున్నారు. ప్రతీ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు చుట్టు పక్కల మండలాల నుంచి, సరిహద్దులో గల మహారాష్ట్ర నుంచి సైతం మల్లయోదులు వచ్చి కుస్తీ పోటీల్లో పాల్గొంటారు.

దొంగిలించిన ట్రాక్టర్ పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్, నిందితుడితో పోలీసులు

ఖానాపూర్, ఏప్రిల్ 8 : మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో ఈ నెల 6వ తేదీన దొంగిలించిన ట్రాక్టర్‌ను సోమవారం ఖానాపూర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపిన కథనం ప్రకారం... ఈ నెల 6వ తేదీన పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మహేందర్ అనే ట్రాక్టర్ డ్రైవర్ పని ముగించుకుని రాత్రి తన ఇంటి వెనకాల ట్రాక్టర్ పార్కింగ్ చేసి పెట్టారు. కాగా అదే రాత్రి ట్రాక్టర్ దొంగిలించబడింది. దీంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో మహేందర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో జగిత్యాల జిల్లా సంఘం శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన ఆరెటి రవి అనే వ్యక్తి ట్రాక్టర్‌ను దొంగిలించి కడెం మండలం మద్దిపడగ గ్రామంలో దాచి ఉంచినట్లు గుర్తించారు. సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకొని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు.

బెహ్రాన్‌లో

ఖానాపూర్ వాసి మృతి



ఉప్పు నవీన్ (ఫైల్)

ఖానాపూర్, ఏప్రిల్ 8 : బెహ్రాన్ దేశంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖానాపూర్ సుభాష్ నగర్ కాలనీకి చెందిన ఉప్పు నవీన్(29) అనే వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం... సుభాష్ నగర్ కాలనీకి చెందిన ఉప్పు నవీన్ అనే వ్యక్తి 17 నెలల క్రితం బ్రతుకుదెరువు కోసం బెహ్రాన్ దేశానికి వెళ్లాడు. బెహ్రాన్‌లోని రౌండ్‌బోర్డు మనమ్మ ప్రాంతంలో కూలీ పనిచేస్తున్న నవీన్ ఆదివారం రాత్రి పని ముగించుకొని రూముకు వెళ్లే క్రమంలో రోడ్డు దాడుతుండగా జరిగిన ప్రమాదంలో అక్కడి కక్కడే మృతి చెందాడు. ఆయనతో పాటు పనిచేస్తున్న జిల్లాకు చెందిన వ్యక్తులు నవీన్‌ను గుర్తించి సోమవారం ఉదయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో బ్రతుకుదెరువు కోసం కుటుంబాన్ని విడిచి వెళ్లిన నవీన్ మరణ వార్త విని అతని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతి చెందిన నవీన్‌కు భార్య లావణ్య, ఐదేళ్ల కుమారుడు వినయ్ ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేలా ఏర్పాట్లు చేయాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన తమకు నవీన్ మృతదేహాన్ని తెప్పించేంత స్థోమత లేదని ప్రభుత్వమే ముందుకు వచ్చి మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని వారు కోరారు.

నేటి నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పక్కన ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 8 : ఎస్సారెస్పీ రైతులకు మంగళవారం నుండి సాగునీటి విడుదలకు నీటి పారుదల అధికారులు హామీ ఇచ్చినట్లు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... నీటి పారుదలశాఖ ముఖ్యకార్యదర్శితో ఈ విషయంలో మాట్లాడినట్లు చెప్పారు. ఎస్సారెస్పీ నుంచి డిఫాక్టో సీఎం 8 టీఎంసీల నీటిని దోచుకెళ్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోయి అన్నదాతలు ఆందోళనలో ఉన్నారన్నారు. 42 ముంపు గ్రామాల రైతులు వ్యవసాయంపైనే ఆధారపడ్డారన్నారు. సరస్వతి కెనాల్ నుండి 6 టీఎంసీల నీరు కేటాయిస్తే 6 టీఎంసీల నీటిని మాత్రమే ఇచ్చారని తెలిపారు. ప్రాజెక్టు ఎండిపోయిందని మిగతా టీఎంసీల నీరు ఇవ్వకుండా ఉత్తర తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మంత్రి శ్రీధర్‌బాబు రైతులకు తీరని నష్టం చేస్తున్నారన్నారు. అన్నదాతల దుస్థితికి ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వమే కారణమన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని గద్దెదించాలి

● త్యాగాల చరిత్ర గాంధీ కుటుంబానిది ● జిల్లాకేంద్రంలో బూత్ లెవల్ ఏజెంట్లు, కో ఆర్డినేటర్లతో సమావేశంలో మంత్రి సీతక్క



మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న శ్రీలేఖ



హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు, ఏజెంట్లు, కోఆర్డినేటర్లు

మావల, ఏప్రిల్8: మతోన్మాద బీజేపీ గద్దెదించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన బూత్‌లెవల్ ఏజెంట్లు, కోఆర్డినేటర్లతో మంత్రి సమావేశమై మాట్లాడారు. మనందరి భవిష్యత్తు బాగుండాలంటే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఇక్కడ నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తన శక్తి వంచన లేకుండా కృషిచేస్తానన్నారు. అన్ని పెండింగ్ పనులను పూర్తిచేసి జిల్లాను అభివృద్ధిలో రాష్ట్ర పటంలో అగ్రభాగాన నిలుపుతామని అన్నారు.

● బీజేపీ ప్రభుత్వంపై ఫైర్

మతాల గురించి తప్ప ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి లేదని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రధాని మోదీ మన ఆదిలాబాద్‌కు వచ్చి ఏమిచ్చారని ప్రశ్నించారు. ఇక్కడ ఉన్న సమస్యలపై మాట్లాడకుండా ప్రతిపక్షాల విమర్శలకే తన సమయం కేటాయించారన్నారు. మూతపడ్డ సీసీఐ పరిశ్రమ ఊసే ఎత్తలేదన్నారు. రైల్వేలైన్‌పై భరోసా ఇవ్వలేదన్నారు. ఈ పదేళ్ల గద్దెనెక్కి ప్రజలపై అనేక ట్యాక్సులు మాత్రం వేసిందని ఎద్దేవా చేశారు.

● సుగుణను గెలిపిద్దాం

ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించుకోవాల్సిన బాధ్యత మన ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిపిస్తే ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామ గ్రామానికి నిధులు ఇప్పించే బాధ్యత తనదేనన్నారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణను భారీ మెజారిటీతో గెలిపించి లోక్‌సభకు పంపిస్తే మన సమస్యలపై తన గళాన్ని వినిపిస్తుందన్నారు. అందుకే మన ముందున్న లక్ష్యం ఒక్కటేనని అది సుగుణను గెలిపించడమే అన్నారు. నాయకులు, కార్యకర్తలు అంతకా కార్యోన్ముఖులై లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్, అనిల్, బూత్ ఏజెంట్లు, కోఆర్డినేటర్లకు శిక్షణ నిచ్చేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన పార్టీ ప్రముఖులు, జిల్లా ముఖ్య నాయకులు, ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల బూత్ ఏజెంట్లు, కోఆర్డినేటర్లు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

● కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

రాష్ట్రంలో అన్ని పార్టీల చూపు కాంగ్రెస్‌పైనే ఉందని ఎలక్షన్ నాటికి పార్టీ ఎన్నడూ లేనంత శక్తివంతంగా తయారై విజయపథంలో దూసుకుపోతుందని మంత్రి సీతక్క అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నుంచి పలువురు కౌన్సిలర్లు పార్టీలో చేరారు. 3వ వార్డు కౌన్సిలర్ సాయి ప్రణయ్, మాజీ జడ్పీటీసీ కొండ గంగాధర్, 7వ వార్డు కౌన్సిలర్ అంజు పారిక్‌రావు, 3వ వార్డు నుంచి శంకర్, 35వ వార్డు ప్రెసిడెంట్ అతిక్ తదితరులు అదేవిధంగా బీజేపీ ఎంపీ టికెట్ ఆశించి భంగ పడిన శ్రీలేఖ ఆదివాసి తన భర్త ప్రశాంత్‌తో కలిసి కాంగ్రెస్‌లో చేరారు.



పొన్నారిలో రోగుల వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర పరిశీలకులు

కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు
సర్వేను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు

తాంసి, ఏప్రిల్ 8 : కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేను రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ప్రదీప్‌కుమార్ సోమవారం పరిశీలించారు. తాంసి మండలంలోని పొన్నారి, హస్నాపూర్ గ్రామాలలో ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఏ ఒక్కరిని కూడా వదలకుండా ఆశా కార్యకర్తలు అందరినీ పరీక్షించాలని ఆదేశించారు. అనుమానితుల వివరాలు నమోదు చేసుకుని సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దాగి ఉన్న కుష్ఠు రోగులను గుర్తించేందుకు ఇంటింటా సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2027 సంవత్సరం వరకు భారతదేశాన్ని కుష్ఠు రహిత భారతదేశంగా చూసేందుకు నిర్వహిస్తున్న బృహత్తర కార్యక్రమానికి వైద్య సిబ్బంది అందరూ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ గజానన్, వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య వాణి, డిప్యూటీ పారామెడికల్ అధికారులు వామన్‌రావు, మధుసూధన్‌రావు, పీహెచ్ఎన్ సంపత్‌కుమారి, సూపర్ వైజర్ తులసీరామ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

● సూసైడ్ నోట్‌లో పోలీసులపై ఆరోపణలు



మృతుడు మహేందర్ (ఫైల్)

మావల, ఏప్రిల్ 8: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ మండలం యాపల్‌గూడకు చెందిన పందిరి మహేందర్ ట్రాక్టర్ కూలీ పని చేస్తుంటాడు. 14 ఏళ్ల క్రితం మహారాష్ట్రకు చెందిన సంగీతతో వివాహం జరిగింది. గత కొంతకాలంగా మహేందర్ ఎలాంటి పని చేయకపోవడంతో భార్యభర్తల మధ్య మనస్పార్థలు ఏర్పడ్డాయి. దీంతో గొడవలు జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో మహేందర్ మద్యానికి బానిసయ్యాడు. భార్య తరపు బంధువులు తనను కొట్టారని మహేందర్ వారం క్రితం ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఇరు కుటుంబాలను కూర్చోబెట్టి సముదాయించి పంపించారు. కానీ మృతుడు మహేందర్ 'తాను ఫిర్యాదు చేస్తే పోలీసులు వారిపై కేసు నమోదు చేయలేదన్న కారణంతో చనిపోతున్నాను' అని సూసైడ్ నోట్‌లో పోలీసులపై ఆరోపిస్తూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై రూరల్ ఎస్సై సయ్యద్ దహ ముజాహిద్‌ను సంప్రదించగా సూసైడ్ నోట్ మా దృష్టికి రాలేదని, వస్తే పరిశీలిస్తామన్నారు. భార్య, భర్తల మనస్పర్ధల కారణంగా జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీతోనే సుపరిపాలన

● బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్



మాట్లాడుతున్న గోడం నగేష్

గుడిహత్నూర్, ఏప్రిల్ 8: కేంద్రంలో మరోసారి బీజేపీ ప్ర భుత్వం వస్తుందని, బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. సోమవారం మండలంలోని గర్కంపేట్, పెద్ద మల్కాపూర్, చిన్న మల్కాపూర్, వైజాపూర్ గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయాగ్రామాల్లో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజల కోసం కేంద్రప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిందని వివ రించారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన ప్రతీ సంక్షేమ పథకంలో కేంద్ర ప్రభుత్వ నిధుల వాటా ఉందని వివరించారు. దేశంలో మళ్లీ బీజేపీ ప్రభు త్వం రావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని అన్నారు. గుడిసెలో ఉన్న రాముడిని గుడిలో చేర్చిన యుగ పురుషుడు ప్రధాని మోదీ అని అన్నారు. అనంతరం మల్కాపూర్ గ్రామ సమీపంలో ఉపాధిహామీ కూలీలను కలిసి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. వడదెబ్బకు గురికాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మా నంద్, బీజేపీ మండల అధ్యక్షుడు జాడి సుభాష్, వైస్ఎంపీపీ భారత్, జిల్లా అధికార ప్రతినిధి కేంద్రే లక్ష్మణ్, తదితరులున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే అధికారం

ఇంద్రవెల్లి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ బీజేపీదే అధికారమని, మరోసారి దేశ ప్రధానిగా మోదీని చేసేందుకు ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన సమక్షంలో మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, ఎంపీటీసీలు కోవా రాజేశ్వర్, కుమ్ర జంగుబాయి, కొరెంగ సులోచన, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కనక హనుమంతరావు బీజేపీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, జడ్పీటీసీ పుష్పలతా, స్వచ్ఛ భారత్ జిల్లాకన్వీనర్ దీపక్‌సింగ్, తదితరులున్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

క్రీడలతోనే మానసిక ప్రశాంతత

● ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, ఏప్రిల్ 8: క్రీడలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని ఫట్‌బడి తాండ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సెల్‌ఫోన్‌లను వదిలేసి క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. ఇంటర్నెట్ ద్వారా మంచిని నేర్చుకోవాలని కోరారు. ఆయన వెంట స్థానిక నాయకులు, గ్రామస్థులున్నారు.

మాజీ మంత్రిని కలిసిన నోముల భరత్

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్8: నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భరత్ మాజీమంత్రి జోగురామన్నను సోమవారం తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తన సోదరితో వచ్చిన ఆయన మాజీ మంత్రితో పలు అంశాలపై చర్చించారు. అలాగే ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కును కూడా మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఇందులో పట్టణ అధ్యక్షుడు అజయ్, నర్సాగౌడ్ తదితరులున్నారు.

బావి మరమ్మతు పనులను పరిశీలించిన అధికారులు

తలమడుగు, ఏప్రిల్ 8: మండలంలో ఇటీవల జిల్లా కలెక్టర్ అకస్మీకంగా తనిఖీ చేయగా లక్ష్మీపూర్ గ్రామంలో తాగునీటి ఎద్దడి ఉందని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఇజల్లా కలెక్టర్ గ్రామంలో బోరుబావితో పాటు అసంపూర్తిగా ఉన్న బావి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో లక్ష్మీపూర్ గ్రామ సమీపంలో ఉన్న బావి పనులు మరమ్మత్తు పనులు ప్రారంభం కావడంతో సోమవారం ఎంపీడీఓ శేఖర్ తహసీల్దార్ రాజమోహన్,ఎంపీఓ వినోద్‌కుమార్‌లు పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ప్రత్యేక అధికారికి ఆదేశించారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల కోసం ప్రత్యేక నిధులతో చేపడుతున్న చర్యలో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ పక్కన కమ్యూనిటీ హాల్, బోరును వేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.అదే విధంగా వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉపాధిహామీ కూలీలు ఉదయం పూటనే పనులకు వెళ్లాలన్నారు.అనంతరం బావి పనులను పరిశీలించి వివరణ అడిగి తెలుసుకు న్నారు. ఇందులో మిషన్ భగీరథ ఏఈ మహేశ్, పంచాయతీ సెక్రటరీ సంతోష్, గ్రామస్థులు మనోహర్ పాల్గొన్నారు.

తాత్కాలిక బస్‌షెల్టర్ల ఏర్పాటు



నిర్మల్ జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద తాత్కాలిక షల్టర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 8 : వేసవి ఎండలదృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్‌షెల్టర్‌లను ఏర్పాటు చేసినట్లు టీఎస్ ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. మంచిర్యాల చౌరస్తా శివాజీ చౌక్ వద్ద నిర్మల్ ప్రయాణికులకు, ఖానాపూర్ నుంచి మంచిర్యాల, నిర్మల్ వెళ్లే ప్రయాణికులకు ఖానాపూర్‌లోని ఐబీ వద్ద ఈ షల్టర్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు వీటిని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ షెడ్‌లలో వాహనాలు నిలుపరాదన్నారు.

బాలికకు ఆర్థిక సహాయం

దిలావర్‌పూర్, ఏప్రిల్ 8 : మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అల్లుడు రంజిత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మండలంలోని గుండంపెల్లి గ్రామానికి చెందిన అనాధ బాలిక పతిక పేరిట రూ. లక్ష బ్యాంకులో డిపాజిట్ చేశారు. గుండంపెల్లి గ్రామానికి చెందిన భీమన్న, లక్ష్మిల దంపతుల కూతురు పతిక. అయితే పతిక ఏడాదిన్నర వయసు ఉండగా తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు. పతిక అనాధగా మారింది. దీంతో సమీప బంధువు చర్లపల్లికి చెందిన హన్మండ్లు, పోసాని దంపతులు పతికను చేరదీసి పెంచుతున్నారు. ఇప్పుడు చిన్నారి పతిక వయసు 5 సంవత్సరాలు. కాగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో చర్లపల్లిలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన రంజిత్‌రెడ్డి దృష్టికి గ్రామస్థులు పతిక దీనగాథను తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన బాలికను దత్తత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆమె చదువు, పోషణ, పెద్దయ్యాక పెళ్లి తన బాధ్యత అని మాట ఇచ్చారు. ఎన్నికలు అయిపోయాయి. మంత్రి అల్లోల ఓడిపోయారు. అయినా ఆయన అల్లుడు రంజిత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పతిక, ఆమె బాగోగులు చూసుకుంటున్న హన్మండ్లు పేరిట యూనియన్ బ్యాంకులో రూ.లక్ష డిపాజిట్ చేశారు. భవిష్యత్‌లో పతికకు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనాధ బాలికకు అండగా నిలిచిన రంజిత్‌రెడ్డికి చర్లపల్లి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

నిఘా.. నలువైపులా !!



ఇచ్చోడ, ఏప్రిల్ 8: ఎన్నికల్లో డబ్బు, అక్రమ మద్యం నియంత్రణపై పోలీసు అధికారులు దృష్టి సారించారు. అందుకు అనుగుణంగా వాహనాలను సిద్ధం చేశారు. 360 డిగ్రీల కోణంలో తనిఖీలు చేసేందుకు వీలుగా ఆధునిక వైర్‌లెస్ కెమెరాలను ఏర్పాటు చేయించిన వాహనం సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని బైపాస్ వద్ద కనిపించిది. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ వాహనం ఊరంతా చక్కర్లు కొడుతూ.. వాహనానికి ఏర్పాటుచేసిన కమెరాలో నలువైపులా నిఘానేత్రం ఆకర్షిస్తు ఉంటుంది

కుల మతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ సోదరభావంతో మెలగాలి

● బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ● ఖానాపూర్‌లో జాన్సన్ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు



ఖానాపూర్‌లో జాన్సన్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన ఆత్రంసక్కు



ఇఫ్తార్ విందులో జాన్సన్‌కు తినిపిస్తున్న మైనారిటీ నాయకులు

ఖానాపూర్, ఏప్రిల్ 8 : నేటిసమాజంలో కులమతాలకు అతీతంగా మనుషులంతా ఒకరిపట్ల మరొకరు సోదరభావంతో మెలగాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. ఆదివారం రాత్రి ఖానాపూర్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కుల మతాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నించే వారి పట్ల హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ముస్లి సోదరులతో కలిసి ఆత్రం సక్కు, జాన్సన్‌నాయక్‌లు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ, సక్కారం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రాజ గంగన్న, గొరేకర్ రాజు, కొక్కుల ప్రదీప్, తదితరులున్నారు.

ఎన్నికల్లో మాదిగలకు అవకాశం ఇవ్వకపోవడంపై
నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆందోళన



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మార్పీఎస్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 8 : నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలో 75 శాతం జనాభా గల మాదిగ కులానికి ఒక్క ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పది రోజులపాటు నిరసన కార్యక్రమాలు చేపడతామని నాయకులు తెలిపారు. నిర్మల్‌లో కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాదిగ జాతికి తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. నాయకులు శనిగారపు రవి మాదిగ, రాజు, బర్కుంట సునీత, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న హెచ్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, వీవో అధ్యక్షులు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 8 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ముఖ్య ఉద్దేశ్యమని ఎంపీడీవో అరుణారాణి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ వీవో అధ్యక్షుల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల నియామకం చేస్తున్నట్లు చెప్పారు. కమిటీలో ఆ గ్రామ వీవో అధ్యక్షురాలు చైర్మన్‌గా ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా, తరగతికి ముగ్గురు తల్లులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. కమిటీ తీర్మానం మేరకే పాఠశాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో అజీజ్‌ఖాన్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో దివ్యరెడ్డి, ఐకేపీ ఏపీఎం సులోచనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన కదిలి ఆలయం



కదిలిలో పూజలు చేస్తున్న భక్తులు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 8 : మండలంలోని కదిలి పాపహరేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. సోమావతి అమావాస్య కావడంతో భక్తులు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పద్దెనిమిది వృక్షాలతో కూడిన మహా వటవృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు మహా అన్నప్రసాదం ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నార్వాడి వెంకట్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్‌లో పోలీసుల కవాతు



దిలావర్‌పూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు


దిలావర్‌పూర్, ఏప్రిల్ 8 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలో పోలీసులు ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. ఎలాంటి ప్రలోభాలకు, భయాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్న ఉద్దేశ్యంతోనే పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు
బిల్లులు చెల్లించండి : ఏఐటీయూసీ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 8 : పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. లేనట్లయితే మండల కేంద్రాల్లో ఆందోళన చేస్తామని, వంట మానేస్తామని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేష్, నాయకులు సిహెచ్ లక్ష్మి, మొనవ్వ, మమత, మనీషా, పావని, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ముందస్తు ఉగాది

ముథోల్, ఏప్రిల్ 8 : ముథోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల, రబీంద్ర ఉన్నత పాఠశాల, అక్షర, ఫ్యూచర్ కాన్సె ప్ట్ స్కూల్, శ్రీవిద్యా, భాష్యం పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది పండగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంతోషంగా ఉగాది పచ్చడి తయారీలో పాలుపంచుకున్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

బోథ్, ఏప్రిల్ 8: మండలంలోని కౌటా (బి) గ్రామంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే జాదవ్అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనారిటీలకు అప్యాయతతో పండ్లు తినిపించారు. మైనారిటీలు చూపించిన అభిమానం మరిచిపోలేమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు తాహెర్ బిల్ సలాం, మండల పార్టీ కన్వీనర్ నారాయణరెడ్డితో పాటు కౌటా(బి) గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియపై అధికారులు అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ రాజార్షిషా



సమావేశంలో అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్8: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ ప్రక్రియపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. సోమవారం సహాయ రిటర్నింగ్ అధికారి ఖుష్బుగుప్తా, వివిధ మండలాల తహసీల్దార్లతో కలెక్టర్ చాంబర్లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 18 నుంచి లోక్సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి 28న వెలువడిన గైడ్లైన్స్ ప్రకారం అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అభ్యర్థులు ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ దాఖలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. నామినేషన్ ప్రక్రియను పూర్తిగా వీడియోగ్రఫి చేయాలని అన్నారు. అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్లో ఎలాంటి బ్లాంకులు లేకుండా చూసుకోవాలని, చెక్ లిస్టు ప్రకారం నామినేషన్ ఫారాన్ని అభ్యర్థులు సమర్పించేలా జాగ్రత్త పడాలన్నారు. నామినేషన్ స్క్రూటినీ రిటర్నింగ్ అధికారి మాత్రమే చేయాల్సి ఉంటుందని వివరించారు. 26వ తేదీన నామినేషన్లను పరిశీలించడం, 29న ఉపసంహరణ గడువు ఉంటుందని తెలిపారు. మే 13న పోలింగ్ను నిర్వహించి జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండి ఈనెల 15వ తేదీ వరకు అన్నిరకాల ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రోరల్కు సంబంధించి ఆపరేటర్, సిస్టమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఆదివాసీల ఉద్యమానికి
మద్దతు ఇచ్చేదెవరు?

- ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే..
- అయినా ఆదివాసీ సమస్యలపై ఊసెత్తని నేతలు
- పార్టీలకతీతంగా ఒక్కటవుతున్న లంబాడాలు
- లంబాడా నేతను పోటీకి దింపేందుకు ప్రయత్నాలు?
- అభ్యర్థులకు అగ్నిపరీక్షగా లోక్సభ ఎన్నికలు











ఆదిలాబాద్,ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): లోక్సభ ఎన్నికల్లో పోటీపడి మరి ఆదివాసీ అభ్యర్థులను ప్రకటించిన ప్రధానపార్టీలు ఆదివాసీల ఉద్యమానికి మద్దతుపై స్పష్టత ఇచ్చినట్లు కన్పించడం లేదు. గత కొన్నేళ్లుగా హక్కుల కోసం పోరాటాలు చేస్తున్న ప్రభుత్వాలు, పాలకులకు పట్టింపేలేకుండా పోయిందంటున్నారు. ఎన్నికల సమయంలోనే ఆదివాసీలు గుర్తొస్తున్న ఆ తర్వాత రాజకీయ పార్టీలు వారి సమస్యలకు పరిష్కార మార్గం చూపినట్లు కనిపించడం లేదు. గత ఆరేడేళ్ల క్రితం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కదిలించిన ఆదివాసీల ఉద్యమం కాలక్రమంగా సైలెంట్ పోయింది. మళ్లీ లోక్సభ ఎన్నికలు రావడంతో ఆదివాసీల ఉద్యమం తెరపైకి వస్తోంది. 2019 ఎన్నికల్లో ఆదివాసీఉద్యమనేతగా ముద్రపడిన సిట్టింగ్ ఎంపీ సోయంబాపురావుకు మద్దతుగా నిలిచిన ఆదివాసీలు గంపగుత్తగా బీజేపీకి ఓట్లు వేయడంతో ఆయన విజయం ఖాయమైపోయింది. ఇది ఉద్యమానికి మరింత కలిసి వస్తుందని అందరూ భావించారు. ఇక త మ అభిమాన నేత చట్టసభల్లోకి వెళ్లడంతో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆదివాసీలు ఆశపడ్డారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ పలుమార్లు ఆదివాసీల సమస్యలను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేసినా ఆశించినస్థాయిలో ప్రయోజనందక్కలేదు. ఐదేళ్లుగడిచినా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్న ప్రధాన డిమాండ్తో ఆదివాసీలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారు. "మా ఊర్లో మా రాజ్యం" నినాదంతో ఏజెన్సీలో కొన్నాళ్లపాటు లంబాడా ఉద్యోగులను కూడా అడ్డుకున్నారు. అయిన వారి సమస్యకు పరిష్కారమార్గాన్ని చూపేందుకు ప్రభుత్వాలు ప్రయత్నించ లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈసారి మాత్రం ఆదివాసీ ఉద్యమానికి అండగా నిలిచే పార్టీల అభ్యర్థులకే మద్దతు ఇస్తామంటూ ఆదివాసీ సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు.

మద్దతుపై భిన్నాభిప్రాయాలు

ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే కావడంతో ఆ సామాజిక వర్గం ఓటర్లు ఎవరికి మద్దతుగా నిలుస్తారన్నదే హాట్టాపిక్గా మారింది. ఆదివాసీ ఉద్యమంలో సోయంబాపురావు తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు కీలకంగా పనిచేశాడనే ప్రచారం ఉంది. దీంతో మెజార్టీ ఆదివాసీలు ఆత్రంసక్కు వైపేమొగ్గుచూపే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ ఎంపీ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ వివాదాలకు దూరంగా ఉంటూ ఉద్యమ సమయంలో అధికార పార్టీ బీఆర్ఎస్లో కొనసాగడంతో ఆయన ఉద్యమానికి అంటిముట్టనట్లుగానే వ్యవహరించారన్న వాదనలున్నాయి. అప్పట్లో రాజకీయాలతో పెద్దగా సంబంధాలు లేని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రంసుగుణ అంతర్గతంగా ఉద్యమానికి అండగా నిలిచిందన్న చర్చ సాగుతోంది. ఏజెన్సీలో ఆదివాసీల కోసం పలురకాల సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదివాసీఓటర్లు ఎవరికీ మద్దతుని చ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ఈసారి అభ్యర్థులెవరికీ వన్సైడ్గా ఓట్లు పడే అవకాశం ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యమజోలికి వెళ్లని అభ్యర్థులు

ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారుకావడంతో ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. అయితే ఎక్కడా ఆదివాసీల ఉద్యమంపై అభ్యర్థులెవరూ బహిరంగ ప్రసంగాలు చేసినట్లు కనిపించడం లేదు. జిల్లాలో కొన్నేళ్లుగా ఆదివాసీ, లంబాడా తెగల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుడడంతో అభ్యర్థులంతా ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అన్నివర్గాల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. అభ్యర్థులంతా ఆదివాసీలే అయినా సొంత సామాజికవర్గానికి మద్దతుగా నిలిచే ప్రయత్నం చేయడంలేదు. ఆదివాసీ, లంబాడా తెగలను దృష్టిలో పెట్టుకుని ప్రచారానికి పదును పెడుతున్నారు. అన్నిపార్టీల్లో లంబాడా నేతలు ఉండడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. లంబాడా నేతలు ఆదివాసీ అభ్యర్థుల ప్రచారానికి దూరంగానే ఉంటున్నారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాల తొలగింపు, జీవో నెంబర్ 3ని పునరుద్ధరణ, పోడుభూముల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇస్తేనే మద్దతుగా ఉంటామని ఆదివాసీలు ప్రకటిస్తున్నారు.

దుమారం రేపుతున్న గౌలిగూడ సమావేశం

లోక్సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలన్నీ లంబాడానేతలను పక్కన పెట్టడంతో పార్టీలకతీతంగా ఆ సామాజికవర్గానికి చెందిన నేతలంతా ఒక్కటవుతున్నారు. తాజాగా నేరడిగొండ మండలం గౌలీగూడ గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ముఖ్య నేతలంతా సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది. ఆదివాసీ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఉమ్మడి అభ్యర్థిని లోక్సభ ఎన్నికల బరిలోకి దించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. లేదంటే స్వతంత్ర అభ్యర్థిగా లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతను బరిలో దింపేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇదే జరిగితే ఆదివాసీఅభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం అవకాశముంది.

నేడే ఉగాది

- నేడు శ్రీ క్రోధినామ ఉగాది
- ఆలయాల్లో పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 8: ఈ ఏడాది శ్రీక్రోధినామ సంవత్సరం మంగళవారం నుంచి ఆరంభం కానుంది. ఉత్తరాయనం, వసంత ఋతువు, చైత్రమాసం, శుక్లపక్షం, పాడ్యమితిథి, రేవతినక్షత్రం మంగళవారం రోజున ఉగాది పండుగను ప్రజలంతా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. శడ్రుచులతో చేసిన పచ్చడితో పాటు ఆలయాలను దర్శించుకోవడం ద్వారా మంచి జరుగుతుందని వేద పండితులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా పలు ఆలయాల్లో పంచాంగ పటనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అర్చకులు, పండితుల ద్వారా రాశుల వారిగా ఆదాయ, వ్యయ, రాజ్య పూజ్యం, అవమానాలను తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తారు.

- ఉగాది ప్రాముఖ్యత

యుగాది అనే పదం యుగాది అనే పదం నుంచి ఉద్భవించింది. ప్రాథమికంగా యుగాది అనే పదం రెండు గొప్పపదాల కలయిక. యుగా అంటే వయస్సు లేదా కలం. ఆది అంటే ఏదో ప్రారంభం. ఉగాది అంటే నూతన సంవత్సరానికి మూలం. ఈ పండుగను జరుపుకునే వ్యక్తులు బ్రహ్మ భగవానుడి పనిని గుర్తించడానికి ఈ పండుగకు ఎక్కువ ప్రాముఖ్యత ఉంది. భగవంతుడు యుగ యుగాల సృష్టికర్తగా అప్పగించబడ్డాడు, పండుగ రోజున కీర్తించబడతాడు.

'ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి'



మాట్లాడుతున్న అభయ్పాటిల్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 8: పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతీ సైనికుడిలా పనిచేయాలని తెలంగాణ ఎన్నికల ఇన్చార్జీ, బెల్గాం (కర్ణాటక) ఎమ్మెల్యే అభయ్పాటిల్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సన్నాహక సమావేశాన్ని స్థానికంగా ఉన్న ఓ హోటల్లో పార్లమెంట్ ఇన్చార్జీ, ఎమ్మెల్యే పాయలశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 17 లోక్సభ స్థానాల్లో 12 గెలిచే అవకాశం ఉందని, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో బీజేపీ తన పట్టును పెంచుకుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ ఏ పార్టీకైనా గెలుపోటములు నిర్ణయించేది కార్యకర్తలదేనన్నారు. పటిష్టమైన క్యాడర్ వ్యవస్థ కేవలం బీజేపీదే అని అన్నారు. ప్రతీ బూత్లో కార్యకర్తలు తమ శక్తి వంచన లేకుండా పని చేస్తున్నారని తెలిపారు. ప్రతీ నాయకుడు తన కార్యకర్తలకు అందుబాటులో ఉంటు వారి సలహాలు సూచనలు స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మహేశ్వర్రెడ్డి, రామారావు పటేల్, హరీస్, గడంనగేష్, మయూర్, అల్లాపూర్ అయ్యన్న ప్రదీప్, బ్రహ్మానంద్ లాలామున్న, జిల్లా, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

గుడిహత్నూర్, ఏప్రిల్8: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని గదులను పరిశీలించారు. అలాగే మందుల నిలువలు, సిబ్బంది పనితీరును, రోజు వారి రోగుల సంఖ్య తదితర వివరాలను సేకరించారు. డీఎంహెచ్వో వెంట డా.శ్యామ్ సుందర్, హెల్త్ సూపర్ వైజర్లు అన్నపూర్ణ, రవీందర్, ఫార్మసిస్ట్ శివాజీ ఉన్నారు.



మందుల నిల్వను పరిశీలిస్తున్న డీఎంహెచ్వో

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

- చెక్పోస్టు సిబ్బందితో తహసీల్దార్ రాజమోహన్



తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రాజమోహన్

తలమడుగు,ఏప్రిల్8: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని లక్ష్యంపూర్ వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్పోస్టును సోమవారం తహసీల్దార్ రాజ మోహన్ అకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల వేళ చెక్పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని క్షుణంగా పరిశీలించాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు అక్రమంగా మద్యం డబ్బులను సరఫరా చేస్తారని వాటి పై ప్రత్యేకంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతంలో ఉన్న చెక్పోస్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫొటో, వీడియోగ్రఫి తీస్తూ వాహనాలను తనిఖీ చేయాలన్నారు. చెక్పోస్టు వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం చెక్పోస్టు వద్ద ఏర్పాటు చేసిన రిజిస్టర్ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో ఎంపీడీవో శేఖర్, ఎంపీవో వినోద్, పంచాయతీ సెక్రటరీ సంతోష్, మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
ఇఫ్తార్	సహర్
సా.6.36	ఉ.4.40

ప్రతీ వస్తువుకు పరిశుద్ధత, పరిశుద్ధత ఉంది. హృదయ పరిశుద్ధత అల్లాహ్ నామస్మరణలో ఉంటుంది



డబ్బును స్వాధీనం చేసుకున్న సీఐ భీమేష్

పోలీసుల తనిఖీల్లో రూ.2.3 లక్షల పట్టివేత

ఇచ్చోడ, ఏప్రిల్8: మండల కేంద్రంలోని బైపాస్ సమీపంలో గల బైల్బజార్ వద్ద సోమవారం మధ్యాహ్నం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 2లక్షల 3వేల 500 నగదును పట్టుకున్నట్లు సీఐ భీమేస్ తెలిపారు. నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నగదును ఎఫ్ఎస్టీ టీమ్కు అప్పజెప్పినట్లు సీఐ వెల్లడించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు.

- 10వేల విలువ గల మద్యం స్వాధీనం

ఇచ్చోడ మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా కిరాణాలు, శీతల పానీయాల దుకాణదారులు మద్యం విక్రయాలు సాగిస్తుండడంతో పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామంలో ఎస్సై నరేష్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా కిరాణ దుకాణంలో బహిరంగంగా విక్రయిస్తున్న పునం శ్రీనివాస్గౌడ్ వద్ద నుంచి రూ.10,500 విలువ గల మద్యం సీసాలను పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.